క్లుప్తంగా

వినాయక నిమజ్జనాలు నిలిపివేత

తొండంగి: పెరుమాళ్లపురం పంచాయతీ కొత్తచోడిపల్లిపేటలో వినాయక విగ్రహాలు నిమజ్జనం నిలిపివేసినట్టు ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి కొత్తచోడిపల్లిపేట సముద్రతీరంతో పాటు పరిసర సముద్ర తీరప్రాంతాలను పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. గతంలో గ్రామం వద్ద పలు ప్రమాద సంఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఈప్రాంతంలో సముద్ర అలలు కూడా ఎక్కువగా ఉండడంతో విగ్రహ నిమజ్జనాలు నిలిపివేస్తున్నట్టు ఆదేశించారని ఎస్సై వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు. పెరుమాళ్లపురం తీరంలో నిమజ్జనాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నేడు నీటి విడుదల

గండేపల్లి: తాళ్లూరు పుష్కర లిఫ్ట్ ద్వారా బుధవారం సాగు నీటిని విడుదల చేయనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభంకానున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ కృతి కాశుక్లా, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొని స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖాధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

గిరిజనులకు మొక్కల పంపిణీ

కోటనందూరు: పాతకొట్టాం పంచాయతీ సంగవాకలో గిరిజనులకు మామిడి, జీడిమామిడి మొక్కలను మంగళవారం పంపిణీ చేశారు. మా తోట కార్యక్రమంలో భాగంగా నాబార్డు సహకారంతో స్వరాజ్య అభ్యుదయ సేవా సమితి(ఎస్ఏఎస్ఎస్) సంస్థ ఆధ్వర్యంలో 200 మంది గిరిజన రైతులకు మొక్కల పంపిణీ చేశారు. అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని, వీరికి బోర్ల ద్వారా నీటి సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు.

రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రత్తిపాడు: వైఎస్సార్ శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా పెదశంకర్లపూడి గ్రామంలో మంగళవారం సాయంత్రం రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అన్నవరం శ్రీసత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దోశ చిట్టిబాబు రైతులకు వాటిని అందించారు.

పది మంది అరెస్టు

రౌతులపూడి: గంగవరంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం రౌతులపూడి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పది మందిని అరెస్టు చేసి, వారి నుంచి ఆరు మోటారు సైకిళ్లు, రూ.40,900 నగదును స్వాధీనం చేసుకున్నారని ఎస్సై అబ్దుల్ నబీ వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను కోర్టుకు తరలిస్తామన్నారు.

సారా తరలింపుపై కేసు

రౌతులపూడి: లచ్చిరెడ్డిపాలెం శివారులో మోటారుసైకిల్‌పై అక్రమంగా సారా తరలిస్తున్న నాగేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 20 లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నట్టు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ మంగళవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించామన్నారు.

విద్యార్థుల ర్యాలీ

కోటనందూరు: బొద్దవరంలో స్వచ్ఛత హి కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ, పారామెడికల్ సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ చేసి పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలను వివరించారు.

విద్యార్థులకు బహుమతులు

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఈనెల 16న నిర్వహించిన మాస్టర్ ఒరేటర్ ఛాంపియన్‌షిప్ సీజన్-5 ప్రిలిమ్స్ పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు ప్రసంగించారు. టోస్ట్‌మాస్టర్ రాజదీప్ ఆధ్వర్యంలో ప్రగతి టోస్ట్‌మాస్టర్ క్లబ్ నిర్వహించిన ఈ పోటీల్లో ప్రగతి, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సెమీ ఫైనల్స్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులు ఆటల్లో రాణించాలి



ఏలేశ్వరంలో క్రీడాకారులతో ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన మండలస్థాయి బాలికల ఆట పోటీల్లో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 185 మంది బాలికలు ఆటల పోటీల్లో పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం క్రీడలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎంఎస్‌సీ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు, సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీతో జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎస్ఎస్ రామ్‌కుమార్, వైఎంసీ చైర్మన్ ఆళ్ళ రామశివ, సంఘన వెంకటేశ్వరరావు, ఏంఈఓలు టి.జోషఫ్, చిన్నారావు, పీడీలు సత్యవతి, రాఘుబాబు, మహ్మద్ ఖసీమా పాల్గొన్నారు.



ప్రత్తిపాడు హాస్టల్ వీధిలో గణనాథుడు



ఎస్.పైడిపాలలో వినాయకుడు



తుని పట్టణం రెల్లిపేటలో వినాయకుడిని దర్శించిన డీఎస్పీ లతాకుమారి



ఏలేశ్వరంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



రత్నగిరిపై వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్న పండితులు

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..

- వైభవంగా వినాయక చవితి వేడుకలు
- గ్రామగ్రామాన ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: ఆదిదేవుడు గణపతి నవరాత్ర ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వీధివీధినా అందంగా అలంకరించిన మండపాలు ఏర్పాటు చేసి గణేశుడిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. కుడుములు, పప్పుండ్రాలు నైవేద్యంగా సమర్పించారు. గ్రామాలన్నీ వినాయకడి నామస్మరణతో మార్మోగాయి. తుని ప్రతిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఏలేశ్వరంలోని పాతబస్టాండ్, అడ్డతీగలరోడ్, నర్సీపటన్నంరోడ్, కాలేజీరోడ్, లింగంపర్తిరోడ్, తోటవీధి, పెద్దవీధి, పల్లపువీధి, పలుకాలనీల్లో వినాయకుని విగ్రహాలను నెలకొల్పారు. చవితి వేడుకల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన గణనాథులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, ఎంపీపీ పర్వత రాజుబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రత్నగిరిపై ఘనంగా చవితి వేడుకలు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో వినాయక చవితి వేడుకలు ఘనంగా ఉదయం8.30 గంటలకు సత్యదేవుని వార్షిక కల్యాణ మండపంలో వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ స్వామివారికి నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం వైదిక కార్యక్రమాల సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వర శర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు వినాయకుడి వృత్తంతాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, చిట్టి శివ, యనమంద్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, అర్చకులు శర్మ, సుధీర్, పవన్ వ్రతపురోహితులు పాలంకి పట్టాభి తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కైలాస గణపతిగా అలంకరణ

వినాయక చవితి సోమవారం శివపార్వతులకు పూజలు చేస్తున్న బాల గణపతిగా వినాయకుడిని అలంకరించి పూజించారు. రెండో రోజు మంగళవారం కైలాస గణపతిగా అలంకరించారు. అన్నవరం గ్రామంలో పలు చోట్ల వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో కుటుంబ సమేతంగా వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షిచారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మాజీపేట, ఫీడర్ రోడ్డులో అష్టలక్ష్మి ఆలయంలో తుని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరి సుధారాణి, బాలు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కౌన్సిలర్లు గణేష్ వేడుకల్లో పాల్గొన్నారు.

స్థానిక రెల్లిపేటలో జరిగిన వేడుకల్లో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పాల్గొన్న పూజలు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. పట్టణ సీఐ గీతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో పలు చోట్ల గణనాథుడిని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సందర్శించి పూజలు చేశారు. ఆయనతోపాటు రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, జిల్లా సాంస్కృతి విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, మండల సచివాలయాల కన్వీనర్ బందారు రాజా తదితరులు ఉన్నారు.

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లో చవితి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.

ప్రత్తిపాడు: మండలంలో చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక హాస్టల్ వీధిలో మహిళలచే నెలకొల్పిన గణనాధునికి తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గ్రామంలో జరిగిన చవితి వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ బెహరా దొరబాబు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గణనాథులను దర్శించుకున్నారు.



శంఖవరంలో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



జగ్గంపేటలో గణపతికి పూజలు చేసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



కైలాస గణపతి అలంకారంలో పూజలందుకుంటున్న దృశ్యం



తొండంగిలో చిన్నారులు ప్రతిష్ఠించిన గణనాథుడు

జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి

తుని: సంక్షేమం, అభివృద్ధిని సమానంగా అమలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలందరూ బాసటగా నిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. మంగళవారం సాయంత్రం 9వ వార్డులో కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ-మన బాధ్యత కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతో ఎలాంటి ప్రయోజనం పొందారని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు రాక పోతే సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేయాలని సూచించారు. మహిళలు స్థానిక ఉన్న పలు సమస్యలను వీరి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల చెప్పిన సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ ప్రసాదరాజుకు సూచించారు. గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



9వ వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీ సుధారాణి, బాలు

పోలింగ్ బూత్‌ల పనితీరుపై సమీక్ష

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో పోలింగ్ బూత్ పరిశీలన పూర్తయ్యిందని నియోజకవర్గ ఎన్నికల అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలు, ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో ఉన్న 227 పోలింగ్ కేంద్రాలను తమ సిబ్బంది పరిశీలించారని వెల్లడించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు అందజేసిన మృతి చెందిన, ఒకటి కంటే ఎక్కువ సారు ఓటరు జాబితాలో నమోదైన, శాశ్వతంగా వలస పోయిన ఓటర్ల జాబితాలపై సమగ్ర విచారణ చేపట్టామని చెప్పారు. ఓటరు జాబితాపై ఎటువంటి ఆపోహలకు తావులేదని ఎన్నికల అధికారి ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ జి.చిన్నారావు, రౌతులపూడి, శంఖవరం తహసీల్దార్లు జి.భీమారావు, కె.నాగ సుబ్రహ్మణ్యం, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి సుబ్బలక్ష్మి

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి

కిర్లంపూడి: మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి పూర్తి చేసిన ఏర్పాట్లను పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలోని తోట గోపాలకృష్ణ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియా, అధికార యంత్రాంగం పాల్గొంటుందన్నారు. మండలంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కేవీ మాధవరావు, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, డీటీ శ్రీనివాసరావు ఉన్నారు.

కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు, ఎంపీడీఓ పద్మాజ్యోతి

గోకవరం: గుమ్మళ్లదొడ్డిలో జగనన్న కాలనీని ఎంపీడీఓ పద్మాజ్యోతి, పలు శాఖల అధికారులతో కలిసి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలను పలువురు వీరబాబు దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఆయన కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

కోటనందూరు: సెప్టెంబర్ 30 వరకూ జరిగే 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రోగ్రాం నోడల్ అధికారి, డీఎంఓ భాస్కరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని అల్లిపూడిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆయన పరిశీలించారు. వలంటీర్లు, పారామెడికల్ సిబ్బందితో కలిసి ఇంటింటా పర్యటించారు. ఆరోగ్య సురక్ష ఉద్దేశ్యం, ప్రభుత్వ లక్ష్యం గ్రామస్తులకు వివరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, ఎస్‌యూఓ ఎర్రిబాబు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలో బుధవారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.పద్మాజ్యోతి వైద్య సిబ్బంది, వలంటీర్లు, ఆశ కార్యకర్తలను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 30 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ తెలిపారు. ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈఓ మూర్తి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, ఎస్‌టిఎస్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.



అల్లిపూడిలో సర్వేను పరిశీలిస్తున్న డీఎంఓ భాస్కరరావు తదితరులు


విశ్రాంత పురోహితులకు గ్రాట్యుటీ చెక్కుల అందజేత



చెక్కుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, ఈఓ అజాద్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, పురోహితులు

అన్నవరం: హిందూ ధర్మ ఔన్నత్యాన్ని కాపాడేందుకు, దేవాలయాలలో భక్తుల సౌకర్యాల కల్పన, ఆలయ ఉద్యోగుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. అన్నవరం దేవస్థానంలో 33 మంది విశ్రాంత వ్రత పురోహితులకు రూ.67.25 లక్షల గ్రాట్యుటీ చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. వార్షిక కల్యాణ మండపం వద్ద జరిగిన కార్యక్రమానికి ఈఓ చంద్రశేఖర్ అజాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పర్వత మాట్లాడుతూ జగన్ సీఎం పగ్గాలు చేపట్టాక దేవస్థానంలో 260 మంది పురోహితుల పారితోషకాన్ని 30 శాతం నుంచి 40 శాతానికి పెంచారన్నారు. గతంలో రిటైరైతే గ్రాట్యుటీ కింద రూ.లక్ష మాత్రమే చెల్లించేవారన్నారు. దేవస్థానం ఈఓ ఫైల్ తయారు చేయగా, తాను మంత్రి దాడిశెట్టి రాజా కలిసిలో దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు నివేదించగా ఆయన సీఎంతో మాట్లాడి గ్రాట్యుటీ పెంపునకు చొరవ తీసుకున్నారన్నారు. ఫలితంగా గరిష్ఠంగా రూ.4.5 లక్షలు, కనిష్ఠంగా రూ.1.5 లక్షలు పొందే అవకాశం కలిగిందన్నారు. ఈఓ చంద్రశేఖర్ అజాద్ మాట్లాడుతూ వ్రతపురోహితులు చేసిన సేవలకు గ్రాట్యుటీ పెంచడం సముచితమైన చర్య అని అన్నారు. ఈ సందర్భంగా వ్రత పురోహితులు ఎమ్మెల్యే పర్వత, ఈఓ అజాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు బద్రీనారాయణ, ధోశ సూర్యనారాయణ, కొత్తెం పశువలరావు పాల్గొన్నారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజు, పీఈటీలు

తుని రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో లోవకొత్తూరు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభకనబర్చారు. క్రీడాకారులను మంగళవారం ప్రిన్సిపాల్ ఎం.రాజు, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 16 వరకూ తునిలో జరిగిన ఈ పోటీల్లో 34 మంది గెలుపొంది, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా విభాగాల్లో తమ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారని ప్రిన్సిపాల్ తెలిపారు. న్నారు. పీఈటీలు పెదపూడి మరిణియ్య, ఏలేటి రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితుల్లో చిచ్చుపెట్టేవారిపై చర్యలు తీసుకోవాలి

తుని రూరల్: దళితవర్గాల మధ్య సామాజిక కుల చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్న సంఘ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని తుని మండలం ఎస్.సూరవరం శివారు ఎస్.ఎస్.వెంకటాపురం గ్రామానికి చెందిన జైభీమ్ యువజన సేవా సంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం తుని తహసీల్దార్ శివకుమార్, రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సై విజయబాబులను వేర్వేరుగా కలసి వినతి పత్రాలు అందజేశారు. బాధ్యులైన నలుగురుపై చట్టపరమైన చర్యలు తీసుకుని శాంతియుత వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. గ్రామ యూత్ కార్యవర్గం 2006 నుంచి ఎస్సీలకు చెందిన యువ సామాజిక, జీవన, వికాస అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. తామంత కలసిమెలసి జీవిస్తుండగా కుట్ర పూరితంగా ప్రకటనలు చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛా వాతావరణంలో జీవించేందుకు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వ్యక్తుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జైభీమ్ యువజన సేవాసంఘం ప్రతినిధులు కోరారు.



తుని రూరల్ సీఐకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలని దీక్ష

తుని: ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో జరుగుతున్న ప్రత్యేక సమావేశాల్లో పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పిలుపు మేరకు ఉమ్మడి గోదావరి జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ మాదిగ మంగళవారం దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 22 వరకు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుమతించాలని కోరారు. నాయకులు కింతాడ సత్తిబాబు మాదిగ, ఆరుగుల సత్తిబాబు మాదిగ, ప్రవీణ్ మాదిగ, జుత్తుక మురళీ, మామిడి రాజా, చీలి ప్రసాద్ పాల్గొన్నారు.

కిర్లంపూడి: ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణం ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు, ఎంఎస్పీ జిల్లా ప్రచార కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ అన్నారు. మండలాధ్యక్షుడు గండేటి డేవిడ్ రాజ్ అధ్యక్షతనలో స్థానిక బస్టాండ్ వద్ద గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్షా శిబిరానికి వారు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందన చిన్నారి, చిత్తారపు గణేష్, కొల్లి భవానీ పలువురు ఉన్నారు.

గోకవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీవర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గెద్దం అనిల్, మండల నాయకులు చింతాటి శ్రీను, మోర్త డానియల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై బైండోవర్

తుని: వినాయ చవితి ఉత్సవాలను ఎటువంటి గొడవలు జరగకుండా శాంతి భద్రతల దృష్ట్యా కొంతమంది రౌడీ షీటర్లపై బైండోవర్ చేసినట్టు తుని పట్టణ సీఐ గీతారామకృష్ణ తెలిపారు. మంగళవారం శిల్పరశెట్టి జగన్మోహన్, దిబ్బ శ్రీను, వాసంశెట్టి మునలయ్య, సబ్బవరపు దుర్గా ప్రసాద్, మాకిరెడ్డి వెంకటేశ్, లవేటి భానులను బైండోవర్ చేసి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, రూ.2 లక్షల విలువ గల బాండును హామీగా తీసుకుని పూచీకత్తుపై విడుదల చేశారన్నారు. వీరందరిపై పలు కేసులు ఉన్నట్టు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం పత్తిపాడు మండలం రాచపల్లి గ్రామానికి చెందిన సారిపిల్లి మణికంఠ స్వామి(27) ఈనెల 16న మోటారుసైకిల్‌పై గండేపల్లి మండలం రామేశంపేట అత్తవారింటికి కాత్రావులపల్లి మీదుగా వెళుతుండగా ఎర్రంపాలెం శివారు రాతి చెరువు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు తెలియజేశారు. మృతుని తండ్రి అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

జగ్గంపేట: గుర్రంపాలెం గ్రామానికి చెందిన పడాల వీరబాబు(45) ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక పురుగమందు తాగాడు. అతడిని కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మంగళవారం మృతి చెందినట్టు జగ్గంపేట సీఐ సూరిఅప్పారావు తెలిపారు. ఈ సంఘటనపై జగ్గంపేట ఇన్‌చార్జి ఎస్సై గణేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.